E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA | సంపుటి :01 | సంచిక :165 | ఆదివారం 24 మే 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-




## హైదరాబాద్ పోలీసింగ్‌లో ఏఐ విప్లవం

### దేశంలోనే తొలిసారి 'ఏఐ కాప్‌రైటర్' యాప్ ప్రారంభం

తెలుగు గళం: హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధునిక పోలీసింగ్ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. భాషా సమస్యల కారణంగా ఫిర్యాదుల నమోదులో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఏఐ కాప్‌రైటర్' పేరుతో కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

## యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి




న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పుణ్యక్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. వేద మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన వేద పాఠశాల భూమి పూజ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి యాదగిరిగుట్ట పెద్దగుట్ట పైకి చేరుకొని సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వేద పాఠశాలకు శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

## మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది

### ఇంధన ధరల పెంపుపై కేంద్రంపై ఖర్గే విమర్శలు

తెలుగు గళం: పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తక్కువ వ్యవధిలోనే పలుమార్లు ఇంధన ధరలు పెంచడం ద్వారా ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, ఆ ప్రయోజనాలను దేశ ప్రజలకు అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఖర్గే అన్నారు. ఇంధనంపై భారీ పన్నులు విధించడం ద్వారా ప్రజల నుంచి అధిక మొత్తంలో ఆదాయం వసూలు చేస్తున్నారని విమర్శించారు.




# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- ఇంటర్ కాలేజీల్లో భోజనం
- టిఫిన్‌కూ గ్రీన్ సిగ్నల్
- విద్యార్థులకు పాలు
- వచ్చే ఏడాది అమలు
- హాజరు పెంపే లక్ష్యం
- పేద పిల్లలకు ఊరట
- పోషకాహారంపై ఫోకస్
- మిడ్‌డే మీల్స్ విస్తరణ
- ప్రభుత్వానికి కీలక నిర్ణయం
- గోదావరి పుష్కరాలకు నిధులు
- రూ.1000 కోట్లు మంజూరు
- భద్రతా కేంద్రాలకు భూములు
- కొత్త పోస్టులకు ఆమోదం
- సమానత్వానికి మరో అడుగు
- తెలంగాణలో కొత్త పథకం




న్యూస్ డెస్క్ , 23 మే (తెలుగు గళం): తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ కాలేజీల్లో తొలిసారి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం అయిన మధ్యాహ్న భోజన పథకాన్ని.. ఇకపై జూ. కళాశాలల్లోనూ అమలు కానుంది.

ఈ కేబినేట్ సమావేశంలో మరో కీలక నిర్ణయం సైతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారాన్ని సైతం అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే విద్యార్థులకు పాలు సైతం పంపిణీ చేసేందుకు కేబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. రానున్న విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందించడం ద్వారా ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థుల గైర్హాజరి తగ్గి.. హాజరు శాతం పెరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

మిగతాది 2 లో..

## మీ ఫ్యూచర్ ఏంటో మీకే తెలియదు మీరు ఫ్యూచర్ సిటీని ఆపుతారా?

### హరీశ్ రావుకు పొంగులేటి కౌంటర్




## టీజీ పాలిసెట్ ఫలితాలు విడుదల




న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం): తెలంగాణ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని ఎస్బీ టెట్ కార్యాలయంలో విద్యాశాఖ కమిషనర్ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 13న జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 98,029 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

### ప్రభుత్వ విప్ నుంచి తప్పుకుంటూ ప్రకటన




న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం): రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. ఇటీవల కాలంలో ఆయన చుట్టూ వరుస వివాదాలు, ఆరోపణలు ముసురుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తన రాజీనామా పత్రాన్ని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శ్రీధర్ అందజేశారు.

## తెలంగాణకు మరో కేంద్ర మంత్రి పదవి

### రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్?




న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం): త్వరలోనే కేంద్ర కేబినెట్ విస్తరణ జరగనున్నదని అందులో తెలంగాణకు మరో మంత్రి పదవి రానున్నదనే చర్చ జరుగుతున్నది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీకి ఆ పదవి దక్కే ఛాన్స్ ఉన్నట్లు టాక్. రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున 8 మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. అందులో బీసీ వర్గానికి చెందిన నేతలు ఎక్కువగా ఉండటంతో అందులో ఒకరికి మంత్రి పదవి కట్టబెట్టాలని ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ఈసారికి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులను యధావిధిగా కొనసాగించాలని మోడీ, షా ద్వయం భావిస్తున్నట్టు సమాచారం.

ఎవరి వైపు మొగ్గు..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ కేంద్ర నాయకత్వం టార్గెట్ పెట్టుకున్నది. అందుకోసం రాష్ట్రంలో బీసీలు ఎక్కువగా ఉండటంతో ఆ వర్గానికి చెందిన నేతలకు కేబినెట్‌లో ప్రయారిటీ ఇచ్చి బీసీ ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి కిషన్ రెడ్డి, బీసీ సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ కొనసాగుతున్నారు. మరోవైపు మంత్రి పదవి రేసులో బీసీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ ఉన్నారు. వీరిద్దరిలో ఎవరిని కేబినెట్‌లోకి తీసుకోవాలనే అంశంపై కేంద్ర నాయకత్వం పలు కోణాల్లో ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

## తెలంగాణలో 'సర్' ఓటర్ల సవరణ పై కాంగ్రెస్ హై అలర్ట్



# యాదాద్రి క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి





వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యాగశాలలో ప్రత్యేక హోమం నిర్వహించగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

అనంతరం సీఎం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన రూ.99.55 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. యాదగిరిగుట్ట క్షేత్రాన్ని దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండ సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆడ్లూరి లక్ష్మణ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేలు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట అభివృద్ధికి భారీ పనులు...

యాదగిరిగుట్ట దేవస్థాన అభివృద్ధిలో భాగంగా సీఎం పలు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.43.80 కోట్లతో వేద పాఠశాల నిర్మాణం, రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పైకప్పు నిర్మాణం, రూ.1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణం, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాళ్లు, దీక్షాపరులు సదనం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కలగనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా వేద పాఠశాల నిర్మాణం ద్వారా వేద విద్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు.

పూర్ణకుంభ స్వాగతంతో స్వామివారి దర్శనం..

పెద్దగుట్ట పై భూమి పూజ కార్యక్రమం ముగిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కొండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి కొండపైకి చేరుకున్నారు. తూర్పు రాజగోపురం మార్గంగా ఆలయంలోకి చేరుకున్న సీఎంకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాలు మధ్య సీఎం ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఎం పర్యటనలో సమన్వయ లోపం?

అయితే సీఎం పర్యటనలో స్వల్ప సమన్వయ లోపం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారిక షెడ్యూల్ ప్రకారం కొండ కింద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో సీఎం హెలికాప్టర్ దిగాల్సి ఉండగా, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు అక్కడే సీఎం రాక కోసం ఎదురు చూశారు. అయితే అనూహ్యంగా సీఎం హెలికాప్టర్ టెంపుల్ సిటీ పైన ఉన్న హెలిపాడ్‌లో దిగింది. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దాదాపు పది నిమిషాలకు పైగా హెలికాప్టర్‌లోనే వేచి ఉన్నారు. అనంతరం అధికారులు అక్కడికి చేరుకొని సీఎంకు స్వాగతం పలికారు. ఈ ఘటన కార్యక్రమంలో కొంతసేపు చర్చనీయాంశంగా మారింది.

రెండు గంటలకు పైగా యాదగిరిగుట్టలో సీఎం..

సీఎం రేవంత్ రెడ్డి రెండు గంటలకు పైగా యాదగిరిగుట్టలో గడిపారు. ఉదయం 08: 42 గంటలకు పెద్దగుట్ట మీద ఉన్న హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. 09. 23 కు వేద పాఠశాల శంకుస్థాపన స్థలం వద్దకు చేరుకొని, 9:37 గంటలకు ముహూర్తం ప్రకారం శంకుస్థాపన నిర్వహించారు. 9: 41 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ఐదు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. 09: 44 గంటలకు పూజ స్థలి వద్ద కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. 09 : 52 గంటలకు కాన్వాయ్ ద్వారా పెద్దగుట్ట నుంచి యాదగిరిగుట్ట ప్రధానాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం 10:56 కు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ కు వెళ్ళిపోయారు.

# ఇండియా కూటమి కాదు.. ఇక కాంగ్రెస్సే..
## జగ్గారెడ్డి సెన్సేషనల్ కామెంట్స్



**న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం):** భగవంతుడి పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతూ, మతం పేరుతో సీట్లు గెలిచి అధికారం కాపాడుకుంటోందని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఈ దేశ ప్రజలకు అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగమే రక్షణ కవచం అని ఈ కవచాన్ని తొలగించాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న కుట్రనే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరాన్ని ఆయన చెబుతున్నారన్నారు. రాజ్యాంగం విషయంలో రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలు కీలకమైనవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఓటు చోరీపై రాహుల్ గాంధీ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు.

ఇండియా కూటమి కాదు కాంగ్రెస్సే: ఐటీ సంస్కరణలకు బీజం వేసింది రాజీవ్ గాంధీ అన్నారు. మరి మోడీ ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. పేదవాళ్ల కోసం ఉపాధి హామీ పథకం తెచ్చింది కాంగ్రెసేనన్నారు. బీజేపీ నేతలు చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. హామీ ఇచ్చినట్లు తెలంగాణను ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఓటు ఒకరికి వేసి మొక్కితే దేవుడు కూడా ఏమి చేయలేదన్నారు. విభజన హామీలు నెరవేరాలంటే తెలంగాణ, ఏపీలో ఇండియా కూటమిలు కాదని నేరుగా కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని డిమాండ్ చేశఆరు. కాక్రోచ్ పార్టీ ఇప్పుడే మొదలైందని వారి ఉద్దేశం పూర్తిగా బయటపడాల్సి ఉందన్నారు.

# తెలంగాణకు మరో కేంద్ర మంత్రి పదవి
## రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్?

మొదటి పేజీ తరువాయి

బీసీ జనాభాలో ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో ఉన్నందున ఆ సామాజికవర్గానికి ప్రయారిటీ ఇవ్వాలని కమలం నేతలు భావిస్తే ఈటల రాజేందర్‌కు పదవి దక్కే అవకాశముంది. మరోవైపు బీసీ సామాజిక వర్గం నుంచి అర్వింద్ (మున్నూరుకాపు) సైతం మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. కానీ అదే సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ ఇప్పటికే కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. దీంతో ఆయనకు అర్వింద్‌కు చాన్స్ ఉంటుందా? లేదా? అనే చర్చ జరుగుతున్నది. మరోవైపు అదే సామాజిక వర్గానికి చెందిన కే లక్ష్మణ్ (ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎంపీ)సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్టు టాక్.

శాఖల మార్పు?

కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులను అలాగే కొనసాగిస్తారని సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరిని పక్కన పెట్టినా తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంటుందని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం కిషన్ రెడ్డి కేబినెట్ మంత్రి హోదాలో బొగ్గు, గనులశాఖలను పర్యవేక్షిస్తుండగా, బండి సంజయ్ స్టేట్ మినిస్టర్ హోదాలో హోంశాఖ బాధ్యతలను చూస్తున్నారు. ఈ ఇద్దరి హోదాను అలాగే కొనసాగిస్తూ శాఖలను మార్చే అవకాశం ఉందని తెలిసింది. కొత్తగా కేబినెట్‌లోకి తీసుకునే మంత్రికి స్టేట్ మినిస్టర్ హోదాతో కీలకమైన శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

డీకే అరుణకు రాష్ట్ర పార్టీ పగ్గాలు?

ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు కమలం పార్టీలో ప్రయారిటీ లేదని, పాత లీడర్లకు పదవులు ఇచ్చి పట్టం కడుతున్నారని పార్టీపై విమర్శలున్నాయి. దీంతో కేంద్రమంత్రివర్గంలోకి ఇతర పార్టీ నుంచి వచ్చిన ఈటల రాజేందర్‌ను తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్టు టాక్. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సైతం కేంద్రమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కానీ, సామాజిక కూర్పులో భాగంగా ఆమెకు మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని టాక్. పార్టీని యాక్టివ్‌గా ముందుకు నడిపించే శక్తియుక్తులు ఉన్న డీకే అరుణకు రానున్న రోజుల్లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదని, ఆ ప్రభావం కేడర్‌లో కనిపిస్తున్నట్లు అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

# ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా
## ప్రభుత్వ విప్ నుంచి తప్పుకుంటూ ప్రకటన

మొదటి పేజీ తరువాయి

తీవ్ర సంచలనం

గత కొద్దిరోజులుగా హర్ష వీణ అనే వివాహిత వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేరు ప్రముఖంగా వినిపించడంతో ఆయన తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ వివాదంపై ఇప్పటికే ఆయన పార్టీ అధిష్టానానికి, ఉన్నతాధికారులకు తన వివరణ ఇచ్చుకున్నారు. అయినప్పటికీ, ఆ వివాదం సర్దగణక ముందే ఆయనపై మరికొన్ని కొత్త ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

రాజకీయ వర్గాల్లోనూ కలకలం

వరుసగా వస్తున్న ఆరోపణల వల్ల పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే ఉద్దేశంతోనే అరవ శ్రీధర్ తన పదవి నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. తనపై వస్తున్న విమర్శలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రభుత్వ విప్ పదవిని వదులుకున్న ఆయన.. ప్రస్తుతానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ రాజీనామా పరిణామం అటు జనసేన పార్టీలోనూ, ఇటు ఏపీ రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేపుతోంది.

# టీజీ పాలిసెట్ ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఇందులో 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 86.38 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 72.92 ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో వరంగల్ కు చెందిన నామాల లోకేశ్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా.. సూర్యాపేటకు చెందిన బానోతు హేమనాథ్ సెకండ్ ర్యాంక్ సాధించారు.

ఈసారి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అత్యంత సులభంగా ఫలితాలను చేరవేసేందుకు తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్ డీ) విభాగం సరికొత్త డిజిటల్ విధానాన్ని తీసుకువచ్చింది. ప్రముఖ డిజిటల్ సేవా వేదిక మీ సేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా ఫలితాలను నేరుగా అభ్యర్థుల మొబైల్ ఫోన్లకే పంపుతున్నారు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన మీ సేవ వాట్సాప్ సేవలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి.

ఫలితాలు పొందే విధానం..

టీజీ పాలిసెట్ ఫలితాలు అధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ (8096958096) ద్వారా నేరుగా అభ్యర్థులకు అందుతాయి. ఇది పూర్తిగా అవుట్‌బౌండ్ సేవ. అంటే అభ్యర్థులు ఫలితాల కోసం ప్రత్యేకంగా ఎలాంటి మెసేజ్ చేయాల్సిన అవసరం లేదు. పరీక్ష రాసి, రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల మొబైల్ నంబర్లకు ఫలితాలు విడుదలైన వెంటనే మార్కుల వివరాలు పీడీఎఫ్ రూపంలో ఆటోమేటిక్‌గా వస్తాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ వాట్సాప్‌కు వచ్చిన ఆ పిడిఎఫ్‌ను తక్షణమే చూసుకోవడంతో పాటు, భవిష్యత్ అవసరాల కోసం డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవచ్చు. ఈ సరికొత్త సాంకేతికత ద్వారా విద్యార్థులకు, తల్లిదండ్రులకు టెన్షన్ లేకుండా, సర్వర్ సమస్యలు రాకుండా పరీక్ష ఫలితాలు వేగంగా, సురక్షితంగా అందుతాయని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ) కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మీ ఫ్యూచర్ ఏంటో మీకే తెలియదు
# మీరు ఫ్యూచర్ సిటీని ఆపుతారా?
## హరీశ్ రావుకు పొంగులేటి కౌంటర్



**న్యూస్ డెస్క్, 23 మే (తెలుగు గళం):** మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. 'హరీష్ రావు.. బీఆర్ఎస్‌లో మీ ఫ్యూచర్ ఏంటో మీకే తెలియదు. అలాంటి మీరు ఫ్యూచర్ సిటీని ఆపుతారా?' అంటూ ఎద్దేవా చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన మంత్రి.. మెరికాలో ఉండి ఫ్యూచర్ సిటీని ఆపేస్తాం అంటూ ప్రకటించిన హరీశ్ రావు.. ఈ భూములను తాకట్టు పెట్టడానికి అమెరికాలో ఎవరితోనైనా ఒప్పందం చేసుకున్నారా? అని ప్రశ్నించారు.

అసూయతో విమర్శలు:

పదేండ్లలో హైదరాబాద్‌లో కనీసం ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టని మీకు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా ఒక నగరమే నిర్మిస్తున్నదంటే అసూయ కలగక తప్పదన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల కోసం ఎక్కడ పడితే అక్కడ ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. కానీ మేము రాష్ట్రం కోసం, దేశం కోసం ఫ్యూచర్ సిటీ కడుతుంటే, ఆపుతాం అంటున్నారని మండిపడ్డారు. మూసీని బాగుచేస్తామంటే అడ్డుపడుతున్నారు, లగచర్లలో ఇండస్ట్రీస్ పెట్టి యువతకు ఉద్యోగాలిస్తామంటే కుట్రచేసారు, ఇప్పుడు ఫ్యూచర్ సిటీని ఆపుతాం అంటున్నారని దుయ్యబట్టారు.

ముందు మీ ఫ్యూచర్ కాపాడుకో:

అధికారంలోకి వస్తామంటూ హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని కానీ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. మీ పొలిటికల్ ఫ్యూచర్ ఖతం చెయ్యాలి అని మీ మామా మీ బామ్మర్ది చూస్తున్నారు.. ఫ్యూచర్ లేని బీఆర్ఎస్ పార్టీ నుండి పోయి మీ ఫ్యూచర్ కాపాడుకో అంటూ హితవు పలికారు. బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదని స్పష్టం చేశారు.

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి



మరోవైపు ఈ కేబినేట్ సమావేశంలోనే మరికొన్ని కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1000 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. అలాగే అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లా మానుకొండూరు మండలం వెలిదిలో 4 ఎకారాలు, చొప్పదండి మండలం రుక్మాపూర్ లో 5, గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. గంగాధర డిగ్రీ కాలేజీకి 29, కేసముద్రం ఫైర్ స్టేషన్ కు 18 పోస్టులు మంజూరు చేసింది.

ఇదిలా ఉంటే విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించే కార్యక్రమం.. దేశంలో 1995 ఆగస్టు 15న అధికారికంగా ప్రారంభమైంది. అప్పట్లో దీనిని 'నేషనల్ ప్రోగ్రామ్ ఆఫ్ న్యూట్రిషనల్ సపోర్ట్ టు ప్రైమరీ ఎడ్యుకేషన్' (NP-NSPE) అని పిలిచేవారు. ప్రారంభంలో దేశంలోని 2,408 బ్లాకుల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పిల్లలకు నెలకు 3 కిలోల చొప్పున బియ్యం లేదా గోధుమలను ఉచితంగా పంపిణీ చేసేవారు.

అయితే 2001 నవంబర్ 28న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇస్తూ.. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోని ప్రతి బిడ్డకు 300 క్యాలరీలు, 8-12 గ్రాముల ప్రొటీన్లు ఉండేలా వండిన మధ్యాహ్నం భోజనాన్ని కనీసం 200 రోజుల పాటు అందించాలని ఆదేశించింది. దీంతో బియ్యానికి బదులుగా పాఠశాలల్లోనే వేడివేడి వండిన భోజనం పెట్టడం తప్పనిసరైంది.

2007లో ఈ పథకాన్ని ప్రాథమిక స్థాయి (1 నుండి 5 తరగతులు) నుండి ఉన్నత ప్రాథమిక స్థాయికి (6 నుండి 8 తరగతులు) విస్తరించారు. 2021లో కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యాహ్నం భోజన పథకం పేరును 'పీఎం పోషణ్ శక్తి నిర్మాణ్'గా మార్చింది. దీని కింద ప్రీ ప్రైమరీ పిల్లలను కూడా చేర్చారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లోనూ అమలు చేయాలని నిర్ణయించడం చారిత్రాత్మక నిర్ణయంగా చెప్పవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇలా ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. పేద పిల్లలు ఆకలి వల్ల బడికి రాకుండా ఉండకూడదనే ఉద్దేశంతో దీనిని తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లి మళ్లీ బడికి రాని పిల్లలను స్కూల్లోనే ఉంచడం కూడా ఈ పథకం ఉద్దేశంగా చెప్పవచ్చు. అలాగే పేదరికం కారణంగా పిల్లల్లో ఉన్న పోషకాహార లోపాన్ని నివారించడం.. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరూ కలిసి కూర్చుని తినడం ద్వారా చిన్నతనం నుంచే సమానత్వ భావనను పెంపొందించడం దీని వెనుక ఉన్న మరో ప్రధాన ఉద్దేశంగా చెప్పవచ్చు.

# హైదరాబాద్ పోలీసింగ్‌లో ఏఐ విప్లవం
## దేశంలోనే తొలిసారి 'ఏఐ కాప్‌రైటర్' యాప్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో ఈ సాంకేతికతను అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ యాప్ ద్వారా బాధితులు తమ మాతృభాషలో ఫిర్యాదు చెబితే, అది వెంటనే రాతపూర్వక రూపంలోకి మారి పోలీసులకు అర్థమయ్యే భాషలోకి అనువదించబడుతుంది. తెలుగు, హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ సహా 10కి పైగా భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం ఈ యాప్‌కు ఉంది. ఫిర్యాదు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు సమాచారంలో పొరపాట్లు తగ్గించడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. ఫిర్యాదు వివరాలు, సమయం, రికార్డు చేసిన అధికారి వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో భద్రపరచబడతాయి. బాధితుడు, సాక్షులు, నిందితులు మాట్లాడిన అంశాలను వేర్వేరుగా గుర్తించి రికార్డు చేసే సౌకర్యం కూడా ఇందులో ఉంది.

హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగరంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు, పర్యాటకులు భాషా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీపీ సజ్జనర్ తెలిపారు. మహిళలు, వృద్ధులు, వలస కార్మికులకు పోలీస్ సేవలపై మరింత నమ్మకం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇప్పటికే సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 'సి-మిత్ర', సోషల్ మీడియా పర్యవేక్షణ కోసం 'సాక్-ఐ' వంటి ఏఐ ఆధారిత వ్యవస్థలను వినియోగిస్తున్న హైదరాబాద్ సిటీ పోలీస్, ఇప్పుడు ఫిర్యాదు నమోదు ప్రక్రియలో కూడా ఏఐ సాంకేతికతను ప్రవేశపెట్టింది. దీనివల్ల పోలీసింగ్ వ్యవస్థ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది

మొదటి పేజీ తరువాయి

ఇతర దేశాలు ఇంధన ధరల నియంత్రణ కోసం పన్నులు తగ్గిస్తూ ప్రజలకు ఉపశమనం కల్పిస్తుండగా, భారత్‌లో మాత్రం ధరలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటలీ, ఆస్ట్రేలియా, జర్మనీ, యూకే, ఐర్లాండ్ వంటి దేశాలు ఇంధన పన్నులను తగ్గించడం లేదా ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రజలకు మద్దతుగా నిలిచాయని వివరించారు.

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలు తమ పౌరుల రక్షణ, ఆర్థిక భారం తగ్గింపుపై దృష్టి పెట్టాయని, కానీ భారత్‌లో మాత్రం ధరల పెంపు కొనసాగుతోందని ఖర్గే ఆరోపించారు.

ఇంధన ధరల పెంపు వల్ల సాధారణ ప్రజలు, మధ్యతరగతి, రవాణా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కుప్పల మీదే రైతన్నల చావులు..
## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన కేటీఆర్, రాష్ట్రంలో పాలనా వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపై రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ, "రైతులు రాలిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ తీరును లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రైతుల మరణాలను చూస్తూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వెంటనే స్పందించాలని, వ్యవస్థలో సోయి తెచ్చుకోవాలని హితవు పలికారు.

కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. "దున్నపోతు మీద వాన పడినట్లుగా ప్రభుత్వం వ్యవహరించకూడదు" అంటూ విమర్శించారు.

ఈ రోజు జరగనున్న కేబినెట్ సమావేశంలో ధాన్యం కొనుగోలు అంశంపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పంటలను యుద్ధప్రాతిపదికన సేకరించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు.

కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ధాన్యం కొనుగోళ్ల సమస్యపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హెచ్పివి వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు

## -- ఆడపిల్లల భవిష్యత్ ఆరోగ్యానికి రక్షణ

### యూపీహెచ్సీ ధర్మకాంచలో ప్రత్యేక టీకా డ్రైవ్ -- డాక్టర్ అనురాధ, కౌన్సిలర్ బూడిద జ్యోతి



**తెలుగు గళం న్యూస్ జనగామ మే23**

జనగామ పట్టణంలోని యూపీహెచ్సీ ధర్మకాంచలో 14--15 సంవత్సరాల ఆడపిల్లల కోసం ప్రత్యేక హెచ్పివి వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు యూపీహెచ్సీ ఇన్‌చార్జి డాక్టర్ అనురాధ తెలిపారు. భవిష్యత్తులో మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ సహా అనేక క్యాన్సర్ వ్యాధులను నివారించేందుకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. శనివారం మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌కు చెందిన ఆడపిల్లలను వారి తల్లిదండ్రులతో కలిసి యూపీహెచ్సీ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో టీకాలు వేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడుతూ దేశంలో మహిళల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ రెండవ అత్యధికంగా కనిపిస్తున్న క్యాన్సర్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని తెలిపారు. దీనిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జనగామ యూపీహెచ్సీ ధర్మకాంచలో ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల అంగీకార పత్రంతో ఈ టీకా వేస్తున్నామని, ఇది శాస్త్రీయంగా నిరూపితమైన సురక్షిత వ్యాక్సిన్ అని స్పష్టం చేశారు. అలాగే మే 23 నుంచి వారం రోజుల పాటు యూపీహెచ్సీలో ప్రత్యేక ఛాతి ఎక్స్‌రే క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు, దగ్గు, దమ్ము, ఛాతినొప్పి, ధూమపానం, మద్యం అలవాట్లు, పూర్వ టిబి సమస్యలు, రాత్రివేళ జ్వరం, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో హెచ్పివి వ్యాక్సిన్ వేయించుకోవాలంటే వేల రూపాయలు ఖర్చవుతుందని, ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు సెలవులు ఉన్న ఈ సమయంలో 14--15 సంవత్సరాల ఆడపిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రేవతి, స్వాతిక, సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, వైద్య సిబ్బంది రమేష్, దేవేంద్ర, రాజకుమారి, అనిత, లావణ్య, స్వప్న, జ్యోతి, గణేష్, కవిత, నరేష్, ఆశా కార్యకర్తలు సునీత, సుజాత, రజిత, ఉపేంద్ర, గుండు శశిరేఖ, గోగి కార్ స్వప్న, మలిపెల వాణి తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐ కర్రే స్వామికి జర్నలిస్టుల స్వాగతం

### ప్రజల పక్షాన నిలిచి సేవలందించాలని ఆకాంక్ష




**తెలుగు గళం న్యూస్ వరంగల్ మే23**

వరంగల్ తూర్పు ప్రాంతానికి చెందిన మాల జర్నలిస్టులు ఆజంజాహీ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కర్రే స్వామిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత సందేశంగా పూలమొక్కను బహూకరించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని జర్నలిస్టులు ఆకాంక్షించారు. దీనికి స్పందించిన సీఐ కర్రే స్వామి స్థానికుడిలా సానుకూలంగా మాట్లాడుతూ, ప్రజలు మరియు మీడియా సహకారంతో బాధ్యతాయుతంగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. సీఐని కలిసిన వారిలో బండి రవి, జక్కుల విజయ్ కుమార్, నీలం శివ, రవి తేజ, కిరణ్ కుమార్, బందెల కృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# నిల్వ ఉన్న వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

## -తెలంగాణ రైతు సంఘం

### తరుగు పేరుతో రైతులను మోసం చేయొద్దు -- రైస్ మిల్లుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి-తీగల సాగర్



**తెలుగు గళం న్యూస్ జనగామ, మే 23**

జిల్లాలో నిల్వ ఉన్న వరి ధాన్యం, మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతులను మోసం చేయడం తగదని ఆయన హెచ్చరించారు. శనివారం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్‌తో కలిసి తీగల సాగర్ సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ గన్నీ బ్యాగులు సమకూర్చి, లారీలను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి ధాన్యాన్ని త్వరగా తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్ యార్డులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మద్దతు ధరకు ధాన్యం అమ్మేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, గన్నీ బ్యాగుల కొరతతో పాటు హమాలీల సమస్యల కారణంగా కాంటాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కాంటాలు వేసిన తర్వాత కూడా ధాన్యాన్ని తరలించేందుకు లారీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు నెలల కిందటే ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారులకు నివేదిక ఇచ్చినా ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే 80 శాతం ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు చేస్తోందని, ధాన్యం కొనుగోలు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. జనగామ జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం రైస్ మిల్లులకు చేరుకున్న తర్వాత "తరుగు", "మట్టి" పేర్లతో ఒక్కో 40 కిలోల బస్తాకు నాలుగు కిలోల వరకు కోత విధిస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. అలాగే రైస్ మిల్లుల వద్ద బస్తాకు రూ.30 చొప్పున హమాలీ ఖర్చులు వసూలు చేయడం దారుణమని విమర్శించారు. ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్ స్పందించి రైస్ మిల్లుల వద్ద జరుగుతున్న మోసాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను మాత్రమే సందర్శిస్తూ కాలం గడుపుతున్నారని, రైస్ మిల్లర్ల అక్రమాలపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలిస్తున్న రైతులకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఇవ్వకుండా



కాంట్రాక్టర్లు మోసం చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, ఉర్సుల కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పదోన్నతులతో బాధ్యతలు మరింత పెరుగుతాయి-

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**తెలుగు గళం న్యూస్ వరంగల్ మే23**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన బి. రాజేందర్ ప్రసాద్, కె. రమణాచారి శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. అధికారులు అప్పగించిన విధులను క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు బి. రాజేందర్ ప్రసాద్, కె. రమణాచారిలకు సీపీ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా పదోన్నతి చిహ్నాలను యూనిఫారంపై అలంకరించి అభినందనలు తెలిపారు.

# కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### ఉచిత కంటి వైద్య శిబిరంలో 170 మందికి పరీక్షలు




**తెలుగు గళం న్యూస్ జనగామ, మే 23**

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సందీప్ కుమార్ ఝా సూచించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డా. అగర్వాల్ వైద్య నిపుణులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వైద్య సేవల నిర్వహణ తీరును పరిశీలించి, శిబిరానికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్న చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ద్వారా పెద్ద సమస్యలను నివారించవచ్చన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు మొత్తం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. కార్యక్రమంలో ప్రేరణ సర్వీస్ సొసైటీ చైర్మన్ చింతల సాయిబాబా, వైద్యులు శ్రీకాంత్, కరుణాకర్, డీజీఓ ప్రీతి, మేనేజర్ దయాకర్, నిర్వాహకులు మల్యాల సురేష్, చింతల గణేష్, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పది లోపే పని ముగించండి

### - ఉపాధి కూలీలకు సర్పంచ్ ఆదేశం



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే23**

వరంగల్ జిల్లా:పర్వతగిరి,జమాల్‌పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ చిన్న చెరువు వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం10 గంటల లోపే పనులు ముగించాలని, వడదెబ్బ బారిన పడకుండా నీడ,మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కవితను ఆదేశించారు. హాజరు పట్టికను పరిశీలించారు.ఆశా కార్యకర్తతో కలిసి కూలీలకు థమ్స్ అప్, స్ప్రైట్,ఒఆర్ఎస్,ప్యాకెట్లు పంపిణీ చేశారు.ప్రభుత్వ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు,గ్రామ పంచాయతీ కార్యదర్శి,సిబ్బంది పాల్గొన్నారు.

# జనవాసాల మధ్య సెల్ టవర్ వద్దు

## -గ్రామస్తులు పిర్యాదు



**నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం) :-** మండలంలోని నాయినిపల్లి గ్రామంలో జనవాసాల మధ్య చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని,దానిని గ్రామానికి దూరంగా తరలించాలని స్థానిక యువకుడు పొత్తాపి మస్తాన్ ఆచారి కోరారు,శనివారం ఆయన రాపూరు తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులకు వినతిపత్రం అందజేశారు,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాము సాంకేతిక వృద్ధికి వ్యతిరేకం కాదని, అయితే జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో టవర్ ఏర్పాటు వల్ల రేడియేషన్ ప్రభావంతో గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు,ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని,అధికారులు వెంటనే స్పందించి టవర్ నిర్మాణ ప్రాంతాన్ని మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జనగామ మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఈగం శ్రీనివాస్



తెలుగు గళం న్యూస్ జనగామ మే23

జనగామ పట్టణ ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలవుతున్న సమయంలో ప్రజల సమస్యలకు స్పందన లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రజా సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసి నెలరోజులు గడిచినా ఎలాంటి స్పందన రాకపోవడంతో ఇటీవల జనగామ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించేందుకు వెళ్లినట్లు తెలిపారు. అయితే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కమిషనర్ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అవహేళనగా మాట్లాడారని ఆరోపించారు. "ఎవరైనా చనిపోయారా..? డయేరియా, మలేరియా వచ్చిందా..?" అంటూ మాట్లాడటం ప్రజలను అవమానించే విధంగా ఉందన్నారు. ప్రజల సేవ కోసం నియమితులైన అధికారులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే మానవ హక్కుల సంఘం, సీడీఎంఏ అధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్‌పై తక్షణమే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేశామని, ప్రజా సమస్యల పట్ల అధికారుల నిర్లక్ష్యం సహించబోమన్నారు.

# నష్కల్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ మంటలు..

## రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం




తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే23

జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గడ్డివాములు, గడ్డి కట్టలు, పైప్‌లైన్లు, మోటార్లు, తాటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న ఉపసర్పంచ్ ఆరూరి మాధవ్, వార్డ్ మెంబర్ చేగొండ శ్రీను వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రైతుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. నష్కల్ గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాలివాన కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సుమారు 20 వేల గడ్డి కట్టలు, 10 గడ్డివాములు, వ్యవసాయానికి ఉపయోగించే పైప్‌లైన్లు, మోటార్లు, దాదాపు 5 వేల తాటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఎగిసిపడుతుండటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక ఉపసర్పంచ్ ఆరూరి మాధవ్, వార్డ్ మెంబర్ చేగొండ శ్రీను వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్థులు, రైతుల సహాయంతో గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది - ఎండి అబ్బాస్

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే23



స్టేషన్ ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శనివారం సీపీఎం గ్రామ జనరల్ బాడీ సమావేశం పోలాసు కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడులు ప్రజల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆయన అన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగాన్ని పెంచిందని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పగిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, మంద మహేందర్, పోలాసు పరమేష్, ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, శాఖ కార్యదర్శులు వంగపండ్ల సోమయ్య, నెలమంచ రాంరెడ్డి, దాసరి కొమురయ్య, రామగోని సతీష్, గోడిశాల యాదగిరి, దైద కుమార్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పొలంలో మంటలు ఆర్పబోయి వృద్ధ రైతు సజీవ దహనం

## రేగొండ మండలం రేపాకపల్లి గ్రామంలో విషాదం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

తమ వ్యవసాయ పొలంలో గడ్డిని తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని ఓ వృద్ధ రైతు అక్కడికక్కడే సజీవ దహనమైన అత్యంత విషాదకర సంఘటన రేగొండ మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం.. సాగర్ల చంద్రమౌళి (62) అనే వృద్ధ రైతు తన పొలంలో ఉన్న గడ్డిని తగులబెడుతుండగా, ఒక్కసారిగా వీచిన గాలికి ఆ మంటలు పక్క పొలంలోకి వ్యాపించసాగాయి. మంటలు పక్క పొలాలకు విస్తరిస్తే ప్రమాదం జరుగుతుందని భావించిన చంద్రమౌళి, వాటిని అదుపు చేసేందుకు ఒంటరిగా తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే ఆయనకు 62 సంవత్సరాల వయసు పైబడటం, దానికి తోడు గత కొంతకాలంగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండటం వల్ల మంటలను ఆర్పే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. మోకాళ్ల నొప్పుల కారణంగా ఆయన త్వరగా పైకి లేవలేకపోయారు. ఇదే సమయంలో మంటలు వేగంగా వ్యాపించి ఆయన ధరించిన బట్టలకు అంటుకున్నాయి. చుట్టూ దట్టమైన పొగ, మంటలు ముంచెత్తడంతో చంద్రమౌళి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ దారుణ సంఘటన జరిగిన సమయంలో మృతుడి భార్య భాగ్యమ్మ, కుమారుడు భాస్కర్ లు ఘటనా స్థలానికి సమీపంలోనే ఉన్నప్పటికీ, మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో చంద్రమౌళిని కాపాడుకోలేకపోయారు. కళ్ల ముందే కుటుంబ యజమాని మంటల్లో కాలి బూడిదవ్వడంతో భార్యాబిడ్డల రోదనలు అరణ్యరోదనగా మారాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే రేగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) డి.సుధాకర్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ఈ ఘోర ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు. చంద్రమౌళి మరణంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి



# ఉప సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షునిగా భూక్య శ్రీనివాస్ నాయక్

తెలుగు గళం న్యూస్,పర్వతగిరి/ మే 23:



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏ. బి తండాకు చెందిన ఉప సర్పంచ్ భూక్య శ్రీనివాస్ నాయక్‌ను జిల్లా ఉప సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు బోట్ల కార్తీక్ తెలిపారు. రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు లావుడ్యా రాములు నాయక్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన భూక్య శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# మృతురాల కుటుంబానికి నివాళులర్పించిన దళిత నాయకులు



తెలుగు గళం న్యూస్,పర్వతగిరి / మే 23 :

పర్వతగిరి మండలంలోని దౌలత్ నగర్ గ్రామ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు. మండల యూత్ నాయకులు బర్ల రాజశేఖర్ తల్లి బర్ల రామలక్ష్మి మరణించగా మృతదేహానికి నివాళులు అర్పించిన దళిత సంఘాల నాయకులు. బోట్ల కిట్టయ్య. జంగిలి బాబు. చిన్నపాక శ్రీనివాస్. మాదాసి సుధాకర్. మాసాని వెంకట్. బోట్ల మధు. బోట్ల భాస్కర్. పిట్టల రాజు. కందికట్ల ప్రవీణ్. గోగుల బాబు. రాపాక మధు. బర్ల హరీష్. రాపాక రాజశేఖర్. దబ్బెట నరేష్. యాసరపు సురేష్. పసుల శ్రీనివాస్. నరకుడు రవీందర్. బోట్ల కనకరాజు. బోట్ల చిన్న వెంకన్న. చిన్నపెల్లి శ్రీనివాస్. గాడిపెల్లి చేరాలు. మునిగే కుమారస్వామి. బొట్ల శ్రీనివాస్. చిన్నపాక శ్రీకాంత్. దబ్బటి యాలాద్రి. మునిగ శ్రీకాంత్. రాపాక ప్రభాకర్. జీడి గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



తెలుగు గళం న్యూస్ జనగామ, మే 23



జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను సజావుగా నిర్వహించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో 1,32,459 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, అందులో 1,23,760 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించినట్లు తెలిపారు. 13,115 మంది రైతుల ఖాతాల్లో రూ.233 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అలాగే 17,499 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి, అందులో 16,323 మెట్రిక్ టన్నులను గోదాంలకు తరలించినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఓపీఎంఎస్ నమోదును ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

# పాలీసెట్ ఎంట్రన్స్ లో... విశ్వశాంతి విద్యార్థి స్టేట్ ఫస్ట్

**120/120 మార్కులతో రాష్ట్రంలో మహబూబ్ అర్ఫాజ్ అలీ కి ప్రథమ స్థానం.**

**సత్తుపల్లి చరిత్రలో ఇదే మొదటిసారి.**

**స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన మహబూబ్ అర్ఫాజ్ అలీ.**



సత్తుపల్లి,ఆర్ సి(తెలుగు గళం ) న్యూస్: తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఈనెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పాలీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలు శనివారం వెలువడినాయి.సత్తుపల్లిలో

విశ్వశాంతి విద్యాలయం విద్యార్థి ఎండి. మహబూబ్ అర్ఫాజ్ అలీ 120/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలోప్రథమ స్థానం సాధించాడు.పాలీసెట్ ఎంట్రన్స్ లో సత్తుపల్లి కి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ లభించడం ఇదే మొదటిసారి.

ఈ విద్యార్థి ఎంపీసీలో 30 / 30, ఫిజిక్స్ లో 30 / 30, గణితంలో 30 /30, కెమిస్ట్రీలో 30/30 మార్కులు ( మొత్తం 120/120) సాధించాడు. ఈ సందర్భంగా మహబూబ్ అర్ఫాజ్ అలీ ని సత్తుపల్లి ఎంఈవో యన్. రాజేశ్వరరావు అభినదించారు. ఈ సందర్భంగా అర్ఫాజ్ అలీ మాట్లాడుతూ...

సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ, తల్లిదండ్రులను గౌరవిస్తూ చదువుకోవడం వలన తనకు ఈ విజయం సాధ్యపడిందని ఈ సందర్భంగా అర్ఫజ్ అలీ అన్నారు. అర్ఫాజ్ అలీ తండ్రి అఫ్జల్ జర్నలిస్ట్.

పోటి పరీక్షలకు ప్రోత్సహించడం...

విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మార్కులు, ర్యాంకులు మాత్రమే ధ్యేయంగా కాకుండా తమ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రోత్సహించడం , విషయం పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

వారు చదువులో రాణించేందుకు ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన చేయడంతో పాటు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు.

ఈ ప్రాంతంలో ఎక్కడ పోటీ పరీక్ష నిర్వహించినా తమ విద్యార్థులు పాల్గొనేటట్లుచేయడం జరుగుతుందని అన్నారు. ఫలితంగా పాల్గొన్న ప్రతి పరీక్షలో ఆశించిన ఫలితాలు లభిస్తున్నాయని అన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విద్యార్థిని అభినందించారు.

# నల్లగండ్ల లో రూ.5.85 కోట్లతో రోడ్ల నిర్మాణం



శేరిలింగంపల్లి :(తెలుగు గళం): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో రూ.5 కోట్ల 85 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో పనులు వేగంగా పూర్తి చేసి ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన రవాణా సౌకర్యం కల్పిస్తామని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తపల్లి గోరి మండలంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

**మండల వ్యవసాయ అధికారి జి. సారయ్య**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి

కొత్తపల్లి గోరి మండలంలోని రైతులకు పంపిణీ చేసేందుకు గాను ప్రభుత్వ రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి జి.సారయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల పరిధిలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో మొత్తం 49.80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు.విత్తన క్వింటాలు పూర్తి ధర 16,350 రూపాయలు కాగా, ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం రాయితీ (సబ్సిడీ) పోను 8,175 రూపాయల ధరకే రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.దీని ప్రకారం 30 కిలోల బస్తా ధర 2,452.50 రూపాయలుగా నిర్ణయించబడిందని వివరించారు.జీలుగ విత్తనాలు కావలసిన కొత్తపల్లి గోరి మండల రైతు సోదరులు తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం నకలు (జెరాక్స్) పత్రంతో సంబంధిత క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారిని (ఏఈఓ) సంప్రదించి అనుమతి పత్రం (పెర్మిట్) పొందవచ్చని సూచించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ,రైతు సోదరులు ఈ జీలుగ విత్తనాలను ఎకరానికి 12 కిలోల చొప్పున రాబోయే తొలకరి వర్షాలకు పొలాల్లో చల్లుకొని దున్నుకోవాలని తెలిపారు.విత్తిన 45 రోజుల తర్వాత పంట పూత దశకు చేరుకుంటుందని,ఆ సమయంలో ఆ మొక్కలను భూమిలోనే కలియదున్నుకోవాలని వివరించారు.ఈ పద్ధతిని పాటించడం వల్ల నేలకు నత్రజని అంది భూమి అత్యంత సారవంతం అవుతుందని,ఫలితంగా పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.అంతేకాకుండా భూమిలో చౌడు తీవ్రత కూడా తగ్గుతుందని,కాబట్టి మండలంలోని రైతు సోదరులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి జి.సారయ్య పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.



# డ్రగ్స్ దందాపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

**50 రోజుల్లో రూ.3.69 కోట్ల మత్తు పదార్థాలు స్వాధీనం**

**61 కేసులు నమోదు.. 154 మంది అరెస్టు**

సైబరాబాద్– ( తెలుగు గళం) : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ మాఫియాపై పోలీస్ శాఖ కొరడా ఝుళిపించింది. ఎస్ఓటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, స్థానిక పోలీసులతో కలిసి ఏప్రిల్ 1 నుంచి మే 22 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భారీ మొత్తంలో మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ 50 రోజుల వ్యవధిలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద మొత్తం 61 కేసులు నమోదు చేసి, 154 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.3,69,21,200 విలువైన గంజాయి, హాష్ ఆయిల్‌తో పాటు వివిధ రకాల సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిఘా వర్గాల సమాచారంతో సమన్వయంగా దాడులు నిర్వహించి డ్రగ్స్ ముఠాలను గుర్తించి అరెస్టు చేస్తున్నామని పేర్కొన్నారు.

యువతను మత్తుకు బానిసలుగా మార్చే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త తరహా సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం కీలకమని, డ్రగ్స్ విక్రయాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

సమాచారం అందించేందుకు శేరిలింగంపల్లి జోన్ ఇన్‌స్పెక్టర్ -- 8712680370, కూకట్‌పల్లి జోన్ ఇన్‌స్పెక్టర్ -- 8712663348, కుత్బుల్లాపూర్ జోన్ ఇన్‌స్పెక్టర్ -- 8712663660 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# నేడు పర్వతగిరిలో హిందూ ధర్మ సమ్మేళన సభ- భారీగా తరలిరావాలని పిలుపు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 23

వరంగల్ జిల్లా:లోక కళ్యాణం కోసం హిందూ సమాజం మేలుకోవాలని,నేడు సాయంత్రం 5 గంటలకు పర్వతగిరి మండల కేంద్రంలోని జె ఆర్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించే హిందూ ధర్మ సమ్మేళన సభను విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన నేతలు పిలుపునిచ్చారు.శనివారం గార్డెన్‌లో సభ ఏర్పాట్లను పరిశీలించిన నేతలు,పట్టణంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి ఆహ్వానించారు. సభకు ముందుగా అంబేద్కర్ సెంటర్ నుంచి జె ఆర్ ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. హిందూ ధర్మం,సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పేందుకు దేశవ్యాప్తంగా ఈ సమ్మేళనాలు జరుగుతున్నాయని తెలిపారు.తెలంగాణలో పర్వతగిరిలో సభ జరగడం అదృష్టమని,భారత్‌ను విశ్వగురువుగా నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.


ముఖ్య అతిథులు & వక్తలు సంగవక్త లక్ష్మణ సుధాకర్, మహిళా వక్త వసుంధర, స్వామిజీ శ్రీ జ్ఞాన చైతన్య నందస్వామి, గూడెల్లి శివప్రసాద్. పాల్గొనబోతున్నారు

ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున హిందువులు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సర్పంచ్ చీదురు శంకర్, అధ్యక్షులు చీదురాల వేణుగోపాల్, వ్యాఖ్యాత గూడెల్లి శివప్రసాద్, కమిటీ సభ్యులు ప్రతాప్ రెడ్డి, సంపెల్లి పరమేశ్వరరావు, చెవ్వ రాము, శ్రీనివాస్,విశ్రాంత ఉపాధ్యాయులు సురేందర్ రావు, రాణా ప్రతాప్, కోల్లూరి రవి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పెంచలకోనలో పోటెత్తిన భక్తులు.. లక్ష్మీనరసింహుడి నామస్మరణతో మారుమోగుతున్న కోన!

నెల్లూరు జిల్లా రాపూరు (తెలుగు గళం):– నెల్లూరు జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధి భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసిన అనంతరం వచ్చే 'మూడవ శనివారం' నాడు స్వామివారిని దర్శించుకుంటే విశేష పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో పెంచలకోనకు తరలివచ్చారు. ఈరోజు తెల్లవారుజాము కోనేరులో లో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉన్నారు. గోవింద నామస్మరణతో పెంచలకోన అడవి ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో మారుమోగుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ, అధికారులు తాగునీరు, అన్నప్రసాద వితరణ మరియు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.



# కాళేశ్వర పుష్కరాల్లో సాంస్కృతిక వైభవం

**భక్తులను అలరిస్తున్న భక్తి,జానపద కీర్తనలు**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం

కాళేశ్వర క్షేత్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక ఉత్సాహం,సాంస్కృతిక వైభవం నిండుగా కొనసాగుతున్నాయి.పుష్కరాల కాలంలో పుణ్యస్నానాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.పుష్కర స్నానఘట్టాల (ఘాట్) వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై కళాకారులు ఆలపిస్తున్న భక్తి గీతాలు,సాంప్రదాయ జానపద గీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతి అమ్మవారి మహిమలను, భారతదేశ నదీ సంస్కృతి జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సాగుతున్న గేయాలు, ప్రదర్శనలు భక్తుల హృదయాలను అలరిస్తున్నాయి.ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ పవిత్ర సరస్వతి పుష్కరాల పర్వదినాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది.ఈ వినూత్న ప్రదర్శనల ద్వారా తెలంగాణ ప్రాంత విశిష్ట సంస్కృతి,సాంప్రదాయాలు దేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు మరింత చేరువ అవుతుండటంతో పాటు,గ్రామీణ కళాకారులకు తమ ప్రతిభను చాటుకోవడానికి ఇవి ఒక అద్భుతమైన వేదికగా మారాయి.పుణ్యస్నానాలు ముగించుకున్న భక్తులు పెద్ద ఎత్తున ఈ వేదికల వద్దకు చేరుకుని కార్యక్రమాలను ఆస్వాదిస్తూ కళాకారుల ప్రతిభను అభినందిస్తున్నారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు నేతృత్వంలో అధికారులు ఈ సాంస్కృతిక కార్యక్రమాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పుష్కరాల ముగింపు వరకు భక్తులకు నిరంతరాయంగా ఆధ్యాత్మిక చింతనతో పాటు సాంస్కృతిక వినోదాన్ని,ఆహ్లాదాన్ని అందించేలా మరిన్ని వైవిధ్యభరితమైన ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా పత్రికా ముఖంగా అధికారులు వెల్లడించారు.



# పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

**చందానగర్‌లో ప్రతి శనివారం 3 వేల మందికి అన్నదానం**



శేరిలింగంపల్లి – ( తెలుగు గళం: ఆకలితో అలమటిస్తున్న పేదలు, బడుగు బలహీన వర్గాలు, పాదచారుల ఆకలి తీర్చేందుకే అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ తెలిపారు. చందానగర్ గంగారంలోని వివిధ షోరూంలలో పనిచేస్తున్న కార్మికులు, స్థానికులకు ప్రతి శనివారం సుమారు 3 వేల మందికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమని స్థానిక ప్రజలు కొనియాడారు.

శనివారం హోప్ ఫౌండేషన్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ప్రత్యక్షంగా లేకున్నా, నియమ నిబంధనలు పాటిస్తూ క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు కొనసాగించడం పట్ల నిర్వాహకులను స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో అన్నె సందీప్, గాలి కృష్ణ, రవి కుమార్, భాస్కర్, మధుసూదన్ రెడ్డి, మల్లేష్, విష్ణుమూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, కిరణ్, విజయ్, సంతోష్, ప్రకాష్, దత్తు, సురేష్, నక్క శ్రీను, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద జూదరుల అరెస్ట్

## నలుగురు వ్యక్తులు అదుపులోకి, నగదు స్వాధీనం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం

కాళేశ్వరం క్షేత్రంలో అత్యంత పవిత్రంగా జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో,పుణ్యక్షేత్ర పరిసరాల్లో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను కాళేశ్వరం పోలీసులు శనివారం రాత్రి రంగులతో సహా పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్కర స్నానఘట్టాల (ఘాట్) ప్రాంతంలో రక్షకభట శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు,నిరంతర నిఘా చర్యలను చేపట్టింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో కాళేశ్వరం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) జి. తమాషా రెడ్డి తన సిబ్బందితో కలిసి పుష్కర ఘాట్ పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా గస్తీ (పెట్రోలింగ్) నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కొంతమంది వ్యక్తులు పుణ్యక్షేత్రం పరిసరాల్లో భక్తులను ప్రలోభపెడుతూ "లక్ బై ఛాయిస్" పేరుతో అక్రమంగా జూదం ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది.సమాచారం అందిన వెంటనే ఎస్ఐ తమాషా రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మిక దాడి చేశారు.అక్కడ కొంతమంది వ్యక్తులు డబ్బులు పణంగా పెట్టి స్టిక్కర్లతో జూదం ఆడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు.ఘటనా స్థలంలో పోలీసులను గమనించిన జూదరులు అక్కడ నుండి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి నలుగురు వ్యక్తులను వెంబడించి మరీ అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని కురకుల వెంకటేష్, మల్లబోయిన శివ, అంబి పోశాలు, కురకుల సదానందంగా గుర్తించారు.వారి వద్ద నుండి జూదానికి ఉపయోగించే మూడు నారింజ రంగు ప్లేయింగ్ స్టిక్కర్లతో పాటు 2,730 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం స్థానిక మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి,నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ అక్రమ జూదంపై కాళేశ్వరం ఎస్ఐ జి.తమాషా రెడ్డి కేసు నమోదు చేసుకుని,పూర్తి స్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.పవిత్రమైన పుష్కరాల సమయంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# కాళేశ్వరం పుష్కరాల్లో మిషన్ భగీరథ సేవలు అమోఘం




## భక్తులకు నిరంతర తాగునీరు,పారిశుధ్యం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం

కాళేశ్వర క్షేత్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ విభాగం విస్తృత స్థాయిలో తాగునీరు,పారిశుధ్య సదుపాయాలను కల్పించి విశేష సేవలు అందిస్తోంది.పుష్కర ఘాట్ల వద్దకు భారీగా తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని,పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా క్షేత్ర పరిసరాలలో మొత్తం 540 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయగా,భక్తుల దాహార్తిని తీర్చేందుకు 38 ప్రత్యేక నీటి పంపిణీ కేంద్రాలను (వాటర్ కియోస్క్) అందుబాటులోకి తెచ్చారు.అలాగే తాత్కాలిక,శాశ్వత మరుగుదొడ్లను నిరంతరం శుభ్రపరచడం కోసం 115 మంది ప్రత్యేక కార్మికులను నియమించారు.తాత్కాలిక నివాస ప్రాంతాలు (టెంట్ సిటీ) అంతటా పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తూ, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు 8 అత్యాధునిక గల్ఫర్ యంత్రాలను నిరంతరం వినియోగిస్తున్నారు.పుష్కర ఘాట్లు, వాహనాల నిలుపుదల కేంద్రాల వద్ద భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు అందుబాటులో ఉండేలా 5 పెద్ద నీటి ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు.భక్తుల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని సరఫరా అవుతున్న నీటి నాణ్యతను కాపాడేందుకు రసాయన శుద్ధీకరణ (క్లోరినేషన్) ప్రక్రియను ప్రయోగశాల సిబ్బంది ద్వారా క్రమం తప్పకుండా ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నారు.ఈ పనులన్నింటినీ సమర్థవంతంగా అమలు చేయడానికి మిషన్ భగీరథ విభాగంలోని ఉన్నతాధికారులు,సిబ్బంది పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు.ఆ శాఖ ముఖ్య ఇంజినీర్ (చీఫ్ ఇంజినీర్) కె.సురేష్ నేరుగా పర్యవేక్షిస్తుండగా,సూపరింటెండింగ్ ఇంజినీర్ చలమల రెడ్డి,కార్యనిర్వాహక ఇంజినీర్లు (ఈఈలు) స్వేత,మాణిక్యరావు,ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు (డీఈఈలు) పి.రమేష్,కిరణ్,సంధ్యారాణిలతో పాటు 15 మంది సహాయక ఇంజినీర్లు (ఏఈలు/ఏఈఈలు),6 మంది ల్యాబ్ సిబ్బంది,30 మంది హెల్పర్లు రంగంలోకి దిగారు.వీరితో పాటు ఏజెన్సీ ద్వారా నియమించబడిన 120 మంది నీటి సరఫరా నిర్వహణ సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధుల్లో నిమగ్నమయ్యారు.పుష్కర రోజులలో




భక్తులకు స్వచ్ఛమైన నీరు, సంపూర్ణ పారిశుధ్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో సేవలందిస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ రాహుల్ శర్మ





## క్రీడాకారులు,విద్యార్థులకు ప్రశంసలు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం నిర్వహించే ఉపాధి మేళాలను (జాబ్ మేళాలను) సద్వినియోగపరుచుకొని ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయ సమావేశ మందిరంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బృహత్ ఉద్యోగ మేళాలో (మెగా జాబ్ మేళాలో) వివిధ కంపెనీలకు ఎంపికైన యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు ఆయన జ్ఞాపికలను (మెమొంటోలను) బహుకరించి అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ,ప్రస్తుత ఉద్యోగ మేళా ద్వారా మన జిల్లా నుండి 43 మంది ప్రతిభావంతులైన యువతీ యువకులకు ప్రముఖ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు లభించడం ఎంతో అభినందనీయమన్నారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి కప్ (సీఎం కప్) క్రీడా పోటీలు ఎంతో అద్భుతంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు.ఈ క్రీడా పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి,రేపటి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని,తద్వారా మన జిల్లాకు రాష్ట్రానికి దేశవ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా పర్యాటక శాఖ ద్వారా నిర్వహించిన పారిశుధ్య దినోత్సవ (క్లీన్ డే) కార్యక్రమంలో భాగంగా చారిత్రక కోటగుళ్ల పరిసరాలను స్వచ్ఛందంగా పరిశుభ్రం చేసిన క్రీడాకారులను,పురాతత్వ శాఖ సంచాలకులు (ఆర్కియాలజీ డైరెక్టర్) బుజ్జి,రక్షణ అధికారి రాజు, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఘనమైన కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు,ఆ శాఖ సిబ్బంది శివసాగర్,ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు,వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అమ్మోనియా లీకేజీ తో ప్రమాదం .!!



నక్కపల్లి, తెలుగు గళం మే 23: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు టోల్‌ప్లాజా వద్ద శనివారం తృటిలో భారీ ప్రమాదం తప్పింది. అచ్చుతాపురం సెజ్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న అమ్మోనియా రవాణా వాహనం నుంచి గ్యాస్ లీకేజీ చోటుచేసుకోవడంతో టోల్‌ప్లాజా సిబ్బంది అప్రమత్తమయ్యారు.

వాహనం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న సమయంలో గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించిన సిబ్బంది వెంటనే డ్రైవర్‌ను హెచ్చరించారు. అనంతరం వాహనాన్ని టోల్‌గేట్‌కు కొద్ది దూరంలో రహదారి పక్కన నిలిపి వేయించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన సిబ్బంది వెంటనే నక్కపల్లి పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్త చర్యలు చేపట్టారు. నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్లే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. అమ్మోనియా గ్యాస్ ప్రభావం వాహనదారులు, స్థానికులకు తాకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

లీకేజీని అదుపులోకి తీసుకొచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది నిరంతరం నీటిని వినియోగించారు. గ్యాస్ పూర్తిగా తగ్గే వరకు సహాయక చర్యలు కొనసాగించారు. నక్కపల్లి ఎస్సై సన్నీబాబు నేతృత్వంలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి పరిస్థితిని పర్యవేక్షించారు.

టోల్‌ప్లాజా సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక శాఖ సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# అకాల వర్షాల మృతులు బాధాకరం: మంత్రి అనిత

## మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది



పాయకరావుపేట, మే 23,తెలుగు గళం : అనకాపల్లి జిల్లాలో అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా చోటుచేసుకున్న ప్రాణనష్టాలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో కొబ్బరి చెట్టు కూలి ఇద్దరు కూలీలు మృతి చెందడం, నక్కపల్లిలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు.


రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఎండలతో పాటు అకాల వర్షాలు, ఈదురుగాలులు, పిడుగులు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా వర్షాలు, బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలవవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు.

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు, కూలీలు, ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి అనిత సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# గండి మైసమ్మ-- మియాపూర్ మెట్రోకు 224జి బస్సు సర్వీస్

మియాపూర్ : (తెలుగు గళం): ఆర్టీసీ మియాపూర్-2 డిపో ఆధ్వర్యంలో రూట్ నెంబర్ 224జి బస్సు సర్వీస్ గండి మైసమ్మ నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సర్వీస్ ద్వారా మియాపూర్, బాచుపల్లి, గండి మైసమ్మతో పాటు ప్రగతి నగర్, నిజాంపేట్ పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు 224జి గండి మైసమ్మ-- మియాపూర్ మెట్రో స్టేషన్ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ వెంకటేశం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# అల్కాపూర్ వేధింపుల కేసు ఛేదించిన నార్సింగి పోలీసులు



శేరిలింగంపల్లి - ( తెలుగు గళం): అల్కాపూర్ టౌన్‌షిప్‌లో మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన కేసును నార్సింగి పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో బాధిత మహిళ తన రెండున్నరేళ్ల చిన్నారిని సమీప ప్లే స్కూల్ నుంచి తీసుకుని ఇంటికి వెళ్తుండగా, ఓ వ్యక్తి వెంబడించి వెనుక నుంచి దుస్తులను పైకి లాగుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు అరవడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్ 78, 79 కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడు వడ్డె నాగరాజు (26)గా గుర్తించారు. ప్రస్తుతం పుప్పాలగూడలో నివాసముంటున్న అతను మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చాకలిపల్లి గ్రామానికి చెందినవాడని తెలిపారు.

నిందితుడికి గతంలో ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదని, ఇలాంటి కేసుల్లో పాల్గొన్న చరిత్ర కూడా లేదని విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.

# ధర్నా చేయనీయకుండా పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారు : వంటేరు ప్రతాపరెడ్డి



మెదక్ : రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు.

పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటాం : మాజీమంత్రి తలసాని



కాంగ్రెస్ అధికారంలో కి వచ్చిన తర్వాత ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇందిరా పార్కు వద్ద గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు కార్యాచరణ , ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. 15 రోజులలో సమస్యలు పరిష్కరించకుంటే ఛలో సెక్రెటరీయేట్, అసెంబ్లీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్వరాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని కేసీఆర్ కోరుకున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దోచుకోవడమే తప్ప పేద ప్రజల సమస్యలు పట్టవని, ఇది ప్రజాపాలన కాదు, రాక్షస పాలన అని విమర్శించారు.

### చంద్రబాబుకు మేలు చేయాలనే

# పాలమూరును పడావున పెడుతుండ్రు

### : మాజీ ఎమ్మెల్యే ఆనంద్



గురువు చంద్రబాబు కు మేలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి పాలమూరు ప్రాజెక్టును పడావుపెట్టి, తెలంగాణ నీళ్లను దోచుకుపోవడానికి సహాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ మెతుకు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90శాతం పూర్తయితే 10 శాతం పనులు కాంగ్రెస్ ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేసి వికారబాద్‌కు సాగు, తాగు నీరు అందిస్తారని భావించిన ప్రజలకు నిరాశే ఎదురవుతుందని ఆరోపించారు. 2027 వరకు కొడంగల్‌కు నారాయణ లిఫ్ట్ ద్వారా నీరు ఇస్తామని చెప్తున్న రేవంత్ రెడ్డి వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలు ఎండపెడుతరా అంటూ ప్రశ్నించారు.

వికారాబాద్ జిల్లాకు సాగు, తాగు నీటి ఇచ్చే ఆలోచన సీఎంకు లేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే ఒక్కో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పాదయాత్ర చేస్తామంటేనే రేవంత్ దిగి వచ్చిందని అన్నారు. వికారబాద్ జిల్లా ప్రజలు రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు ఏకమై పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

# తెలంగాణలో వడదెబ్బతో 16 మంది మృతి..

## కలెక్టర్లకు మంత్రి పొంగులేటి అత్యవసర ఆదేశాలు




రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరగనుందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాల్పుల పరిస్థితుల నేపథ్యంలో మంత్రి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా నివేదికలను పరిశీలించి, ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యతతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**16 మంది మృత్యువాత:**

రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్ల నివేదిక ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కరు చొప్పున ఏడు జిల్లాల్లో 16 మంది వడదెబ్బతో మృతి చెందారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వడదెబ్బ మృతు కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయిల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత మరింత పెరిగింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండకూడదని స్పష్టం చేశారు.

**అప్రమత్తం చేయండి:**

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపాలని మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అప్రమత్తత కల్పించాలని ప్రజలకు అవసరమైన సమాచారం ప్రతి గంటకు చేరేలా చర్యలు తీసుకోవాలని అని అధికారులను ఆదేశించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే చోట్ల చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఒక్క ప్రాణం కూడా ఎండల కారణంగా ప్రమాదంలో పడకూడదని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీలు, నిర్మాణ కార్మికులు, రోడ్లపై పనిచేసే కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని మండల స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు:**

మనుషుల ప్రాణాలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనని గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలని పొంగులేటి కోరారు. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం ఈనెల 26వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి,ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఎండ తీవ్రత, తీవ్రమైన ఉష్ణోగ్రతలు మరియు వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని ఈ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రాజ్యసభ సీటు అమ్ముకున్నారు.. ఆప్‌పై హర్భజన్ సంచలన ఆరోపణలు..



టీమిండియా మాజీ క్రికెటర్, రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో రాజ్యసభ సీటు అమ్ముకుందని ఆరోపణలు చేశారు. ఆప్ నుంచి రాజ్యసభకు ఎంపికైన హర్భజన్ ఇటీవల మరికొందరితో కలిసి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. హర్భజన్ బీజేపీలో చేరడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి

'ఆప్ నుంచి వచ్చిన రాజ్యసభ సీటుకు ఎందుకు రాజీనామా చేయలేదు. మీ మనస్సాక్షికి ఎంత వెలకట్టి బీజేపీలో చేరారు' అని హర్భజన్‌ను ఒక నెటిజన్ ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు హర్భజన్ తనదైన శైలిలో ఘాటుగా సమాధానం చెప్పారు. 'సమయం వచ్చినపుడు అందరి ప్రశ్నలకు సమాధానాలు చెబుతాను. నేను ఎవరి గురించీ తప్పుగా మాట్లాడలేదు. విమర్శలు చేయలేదు. నన్ను ద్రోహి అనే ముందు మీ పార్టీ నేతలు రాజ్యసభ సీటును ఎంతకు అమ్ముకున్నారో అడగండి' అని పేర్కొన్నారు.

'పంజాబ్‌ను దోచుకోవడానికి మంత్రులు, అధికారులు ప్రజలను ఎలా మోసం చేశారో నేను చెబుతాను . వారు పంజాబ్‌ను పూర్తిగా నాశనం చేశారు. మీ నాయకుడికి (కేజ్రీవాల్) రాష్ట్రంపై ఒక శాతం ప్రేమైనా ఉంటే బాగుండేది' అని హర్భజన్ అన్నారు. కాగా, హర్భజన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. ఆప్‌లో రాజ్యసభ సీటును అమ్మిన వారి వివరాలను బయటపెట్టాలని డమాండ్ చేశారు.

# చోరీలపై ఉక్కుపాదం: 51 కేసులు ఛేదించి, 60 మంది అరెస్ట్!



నగరంలో చోరీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా విశాఖ క్రైమ్ విభాగం పోలీసులు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఏప్రిల్ నెల 'రికవరీ మేళా'లో రికార్డు స్థాయిలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందజేశారు. ఏప్రిల్ నెలలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 68 చోరీ కేసులు నమోదు కాగా, సాంకేతికత, చాకచక్యంతో వ్యవహరించిన క్రైమ్ పోలీసులు కేవలం నెల రోజుల్లోనే 51 కేసులను చేధించారు. ఈ కేసులతో సంబంధం ఉన్న 60 మంది ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ముద్దాయిల నుంచి రూ. 1.04 కోట్ల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 924.14 గ్రాముల బంగారం, 4.5 కేజీల వెండి మరియు రూ. 3.12 లక్షల నగదు ఉన్నాయి. ఈ సొత్తును పోలీస్ కమిషనర్ (సీపీ) శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా శనివారం బాధితులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గడిచిన 22 నెలల్లో విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అద్భుతమైన పనితీరు కనబరిచామని, మొత్తం 9,202 మంది బాధితులకు సుమారు రూ. 22 కోట్ల విలువైన ప్రాపర్టీని రికవరీ చేసి అందజేశామని వెల్లడించారు.

ఇటీవల నగరంలో కలకలం రేపిన హనీ ట్రాప్ కేసుపై సీపీ స్పందిస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. అలాగే నగరంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, పార్ట్ టైమ్ జాబ్స్ పేరుతో మోసాలు జరిగినా, లేదా ఎవరైనా ఆన్‌లైన్‌లో అసభ్యకరంగా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినా ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఆశ్రయించాలని సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు.

# ' తండ్రి ఆశయాలే నా మార్గదర్శకాలు.. కార్యకర్తల అండే నా మనోబలం '



వైరా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే దివంగత భానోత్ మదన్‌లాల్ ఆశయాలను కొనసాగించేందుకు ఆయన కుమార్తె మనీషా లక్ష్మి రాజకీయ రంగప్రవేశం చేశారు. తండ్రి చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవడమే తన రాజకీయ ప్రవేశానికి ప్రధాన కారణమని ఆమె భావోద్వేగంగా వెల్లడించారు. శనివారం కారేపల్లి మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె, వైరా నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

తనా తండ్రి మదన్‌లాల్ ప్రజల కోసం, రైతుల కోసం చివరి శ్వాస వరకు పోరాడారు. ఆయన కలలు సాకారం కావాలంటే ప్రతి కార్యకర్త ఒక్కటిగా నిలవాలి అంటూ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు. మదన్‌లాల్ హయాంలోనే వైరాలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, రైతులకు అండగా నిలిచిన నాయకుడు ఆయనేనని ఆమె పేర్కొన్నారు. నాన్నను విశ్వసించిన ప్రతి కార్యకర్త మా కుటుంబ సభ్యుడే. వారి గౌరవం, భవిష్యత్తు కోసం నేను ఎప్పుడూ అండగా ఉంటాను. వైరాలో బీఆర్ఎస్ జెండా ఎగురే వరకు విశ్రాంతి తీసుకోను అంటూ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తలను ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని మదన్‌లాల్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జగన్ నాయక్, మైనార్టీ నాయకులు గౌసుద్దీన్, రవీందర్, ఎన్. వెంకటేశ్వర్లు, లకావత్ రాము, మండల కార్యదర్శి ఇస్లావత్, బన్సీలాల్, జడల కళ్యాణ్, ఉద్యమ నాయకులు సోమందుల నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో వరుస చోరీలు.. 8మంది దొంగల ముఠాఅరెస్ట్



సిరిసిల్ల జిల్లాలో వరుస చోరీల కేసులో పురోగతి సాధించారు పోలీసులు. సిరిసిల్లలో తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న 8మంది దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులతోపాటు చోరీ సొత్తును కొన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

నిందితులనుంచి బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 17.5 గ్రాముల బంగారం, 14.5 తులాల వెండి ఆభరణాలు, మూడు బైకులు, ఒక ఆటో, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటుపడి చోరీ చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

వరుస చోరీలకు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు పోలీసులు. ప్రతి ఇంటో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు డయల్ చేయాలని కోరారు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రాచారి.

# టీజీ పాలిసెటులో స్టేట్ ఫస్ట్ ర్యాంక్...




టీజీ పాలిసెట్- 2026 ఫలితాల్లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ విద్యార్థిని ఎం.డి అల్వియా షిఫాలి 120 మార్కులకు గాను 120 మార్కులు పొంది, రాష్ట్రంలో ఫస్ట్ ర్యాంకు,ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 117 మార్కులతో 25వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచింది. ఆ విద్యార్థిని జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్ లో శిశు నుంచి పదో తరగతి వరకు చదివింది.ఆ విద్యార్థిని టెన్త్ లో 600 మార్కులకు గాను 583 మార్కులు పొంది, మండల టాపరుగా నిలిచింది.

మండలంలోని పొనకల్ కు చెందిన ఎం.డి హైమద్,అహిషాబేగం దంపతుల కుమార్తె అల్వియా షిఫాలి చిన్నప్పటి నుంచి చదువులో ఎంతో చురుగ్గా చదువుతుంది. శనివారం ప్రకటించిన టీజీ పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించి ఆ విద్యార్థిని స్థానిక స్లేట్ హైస్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి,వ్యవస్థాపకుడు ఏనుగు సుభాష్ రెడ్డి,డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, ప్రిన్సిపాల్ శిరీన్ ఖాన్,ఉపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థిని అల్వియా షిఫాలి టెన్త్లో మండల టాపరుగా,టీజీ పాలిసెట్ లో రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్ సాధించడం తమకు ఎంతో గర్వకారణమన్నారు.

ఆ విద్యార్థిని ఎంబైపీసీలో రాష్ట్ర 25వ ర్యాంకు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచిందని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా ఆ విద్యార్థిని మాట్లాడుతూ.. చదువులో టీచర్లు తనను ఎంతో తీర్చిదిదారన్నారు.ఉపాధ్యాయ బృందం కృషి,తల్లిదండ్రుల ప్రోత్సహంతో ర్యాంకు సాధించానని ఆమె చెప్పారు.ఐఏఎస్ కావడమే లక్ష్యంగా చదువుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

# ధనుష్ కర

## ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్





కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా నటించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'కర'. భారీ అంచనాల మధ్య ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం.. మొదటి షో నుంచే మంచి టాక్ తెచ్చుకుంది. 1991లో జరిగిన గల్ఫ్ యుద్ధం, అప్పట్లో దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం వంటి వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ మూవీ థియేటర్స్‌లో సందడి చేసిన నెలరోజులకు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. 'కర' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా.. మే 28 నుంచి స్ట్రీమింగ్ కాబోతుంది. కాగా.. ఈ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌కు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించగా.. ప్రేమలు ఫేమ్ బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా నటించింది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు. ఈ చిత్రాన్ని తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సిహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర గ్రాండ్‌గా రిలీజ్ చేశారు.

# పెద్ది కి కొత్త కష్టాలు

టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' థియేట్రికల్ ప్రదర్శనపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సినిమా ప్రదర్శనకు సంబంధించి తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ఒక కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. 'పెద్ది' చిత్ర ప్రదర్శనకు గానూ తమకు ఖచ్చితంగా పర్సంటేజ్ (వాటా) ఇవ్వాల్సిందేనని, నిర్మాతలు ఆ పర్సంటేజ్‌కు అంగీకరిస్తూ ఒప్పందంపై సంతకం చేసి ఇస్తేనే థియేటర్లలో సినిమా ఆడిస్తామని ఎగ్జిబిటర్లు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సుధీర్ఘ నిరీక్షణను, ఆవేదనను మీడియాతో పంచుకున్నారు. "అంతకుముందు 'హరిహర వీరమల్లు" సినిమా విడుదల సమయంలోనే మేము ఈ పర్సంటేజ్ డిమాండ్‌ను గట్టిగా వినిపించాలనుకున్నాం. అయితే ఆ సమయంలో డిమాండ్లు పెడితే సినిమాకు ఇబ్బంది అవుతుందని కొందరు కోరడంతో ఇండస్ట్రీ హితం కోరి వెనక్కి తగ్గాం. ఆ తర్వాత నుంచి మా డిమాండ్‌ను నిరంతరం వినిపిస్తూనే ఉన్నాం. ఇప్పుడు 'పెద్ది' సినిమా కూడా వాయిదా పడుతూ ఇక్కడి వరకు వచ్చింది" అని వారు పేర్కొన్నారు.

నిర్మాతల జాప్యంపై ఆగ్రహం..

పర్సంటేజ్ విషయంలో నిర్మాతలు కావాలనే కాలయాపన చేస్తున్నారని ఎగ్జిబిటర్లు ఆరోపించారు. "పోనీ ఈ 'పెద్ద' సినిమాను వదిలేసి, వచ్చే తదుపరి పెద్ద సినిమా నుండి ఈ నిబంధన అమలు చేద్దామని కొందరు అంటున్నారు. లేదా ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని కోరుతున్నారు. ఇలా వాయిదాలు వేసుకుంటూ పోవడం ఇక ఎంతమాత్రం కరెక్ట్ కాదని భావించాం. అందుకే 'పెద్ది' సినిమా నుంచే ఖచ్చితంగా పర్సంటేజ్ పద్ధతిలోనే ఆడించాలని గట్టి నిర్ణయం తీసుకున్నాం" అని అసోసియేషన్ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని 250 మంది థియేటర్ ఎగ్జిబిటర్లందరిదీ ఒకటే మాట అని, ఎవరూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వారు తేల్చి చెప్పారు. డిమాండ్లకు నిర్మాతలు అంగీకరించి సంతకం పెడితేనే ప్రదర్శనకు సహకరిస్తామని, లేనిపక్షంలో సినిమాను థియేటర్లలో ఆడించబోమని అల్టిమేటం జారీ చేశారు. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరి ఈ వివాదంపై 'పెద్ద' చిత్ర నిర్మాతలు ఎలా స్పందిస్తారో చూడాలి.




# అవన్నీ ఫేక్





'సప్త సాగరాలు దాటి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన యంగ్ బ్యూటీ రుక్మిణి వసంత్.. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులు చేస్తూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. అయితే.. బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు చేస్తున్నప్పటికీ ఈ అమ్మడుకి సరైన హిట్ పడలేదు. ప్రస్తుతం రుక్మిణి వసంత్ తన ఆశలన్నీ ఎన్టీఆర్ 'డ్రాగన్' పైనే పెట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీకి సంబంధించిన బికినీ వీడియో క్లిప్స్, ఫొటోస్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాల్లో హిట్స్ లేక సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తుందా అంటూ నెట్టింట ట్రోల్స్ కూడా స్టార్ట్ అయ్యాయి. ఈ క్రమంలోనే నెట్టింట వైరల్‌గా మారిన బికినీ వీడియోపై స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది రుక్మిణి.

'నేను అని చెప్పుకుంటూ ఆన్‌లైన్‌లో ప్రచారం అవుతున్న కొన్ని ఏఐ-సృష్టించిన వీడియోలు, ఫొటోలు నా బృందం అండ్ నేను గమనించాము. ఈ చిత్రాలు పూర్తిగా నకిలీవి.. అలాగే కల్పితమైనవని నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ఇలాంటి తారుమారు చేయబడిన కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యం అండ్ గోప్యత యొక్క తీవ్రమైన ఉల్లంఘన. మేము ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ చిత్రాలను సృష్టించి, వ్యాప్తి చేయడంలో పాలుపడిన వారిపై అవసరమైన చట్టపరమైన, అండ్ సైబర్‌క్రైమ్ చర్యలను ప్రారంభిస్తున్నాము. ప్రతిఒక్కరూ ఇలాంటి కంటెంట్‌ను షేర్ చేయడం, లేదా దాని గురించి మాట్లాడుకోవడం మానుకోవాలని అభ్యర్థిస్తున్నాము' అంటూ నోట్ షేర్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారడంతో.. ఆ బికినీ వీడియో తనది కాదని తెలుసుకున్న అభిమానులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

# 'లెనిన్'

## టీజర్ వచ్చేసింది




అక్కినేని ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'లెనిన్' టీజర్ వచ్చేసింది. అఖిల్ హీరోగా, యువ దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వాయిదాలు పడుతూ వస్తుండగా అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇక ఫైనల్‌గా జూన్ 26న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా ప్రమోషన్స్‌తో ప్రేక్షకుల్లోకి చిత్రాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలోనే తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ గమనించినట్లైతే.. భాగ్యశ్రీ బోర్సే నటకం ప్రదర్శిస్తున్న క్లిప్‌తో స్టార్ట్ అవ్వడగా.. 'ఈ లెనిన్ గాడు నిప్పు.. మనోడు వస్తున్నాడు.. నేను తప్పిపోయి రాలేదు మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా' అంటూ అఖిల్ చెప్పిన డైలాగ్స్ హైలెట్‌గా నిలిచాయి. అలాగే అఖిల్ బొట్టు పెట్టుకుని కూల్ అండ్ ఇన్నోసెంట్ లుక్‌లో కనిపిస్తూనే.. మాస్ ఎలిమెంట్స్, ఫైట్స్‌తో అదరగొట్టాడు. మొత్తంగా ఈ టీజర్‌తో మనోడు ఈసారి హిట్ కొడతాడు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు అక్కినేని ఫ్యాన్స్.

అఖిల్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అవుతున్న సరైన హిట్ ఇప్పటికీ పడకపోవడంతో.. అఖిల్‌తో పాటు అక్కినేని ఫ్యాన్స్ సైతం 'లెనిన్'పైనే ఆశలు పెట్టుకున్నారు. దీంతో అఖిల్ సైతం ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడినట్లు తాజాగా రిలీజ్ చేసిన టీజర్ చూస్తే అర్థం అవుతుంది. అంతే కాకుండా.. రిలీజ్ చేసిన టీజర్‌లో యాక్షన్, ఎమోషనల్ సీన్స్, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండటంతో ఈ సినిమా కచ్చితంగా అఖిల్‌కు మంచి కమ్ బ్యాక్ ఇస్తుందని ఆశిస్తున్నారు ఫ్యాన్స్. కాగా.. ఈ చిత్రంలో నిఖిల్ సరసన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుంది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.